# నువ్వూ + నీ ఎమ్మెస్ వెరసి నీ ఖరీదెంత?

నర్సింగ్ హోమ్ ముందు హంస లాంటి కారొకటి వచ్చి ఆగింది! కారులో నుంచి ఒంటినిండా ఖాళీ లేకుండా నగలు దిగేసుకున్న ఒక లావు పాటావిడ, వెనుక బంగారు తీగలా అతి నాజుకుగా, ఎంతో అమాయకంగా ఉన్న ఓ

పద్దెనిమిదేళ్ళ అమ్మాయి దిగారు. లావుపాటావిడ ఠీవిగానూ, బంగారు తీగ భయం భయంగానూ డాక్టర్‌గారి పేరునీ, డిగ్రీనీ పరిశీలించి డాక్టర్ గారి కన్సల్టేషన్ రూమ్‌వేపు దారి తీశారు. నర్స్ ఎదురొచ్చి ఎంతో వినయంగా, ఆప్యాయంగా ఆహ్వానించి వెయిటింగ్ రూమ్‌లో కూర్చోబెట్టింది.

"డాక్టరమ్మ ఉందా?" దర్పంగా నర్స్ వంక చూసింది లావుపాటావిడ.

"ఉన్నారండి. లోపల పేషెంట్స్‌ని చూస్తున్నారు" అంది నర్స్, ఓ.పి. చీటి వ్రాస్తూ.

"ముందు మమ్మల్ని చూసి పంపమను." నర్స్ అందించిన చీటీని నిర్లక్ష్యంగా అందుకుంది ఆవిడ.

"అరుగో, చూడండి. మీ ముందింకా ఆరుగురున్నారు. వారిని చూడగానే కాంపౌండర్ మిమ్మల్ని పిలుస్తాడు." సౌమ్యంగా చెప్పి మరో పేషెంట్ దగ్గరకు వెళ్లింది నర్స్.

తమను పిలిచే వరకు అసహనంగా అటూఇటూ కదులుతూ కూర్చుందావిడ.

"మా అమ్మాయిని పరీక్ష చెయ్యాలండి" అంది డాక్టర్ గారి రూమ్‌లో అడుగుపెడుతూనే.

"కూర్చోండమ్మా! ఇలారా అమ్మా, నువ్వు." ఎదురుగా ఉన్న కుర్చీని ఆవిడకు చూపించి, ఆ అమ్మాయి వైపు తిరిగింది డాక్టర్ కృష్ణవేణి.

"ఏమిటమ్మా బాధ?" ఆప్యాయంగా ఆ అమ్మాయి వైపు చూచింది కృష్ణవేణి.

అమ్మాయి బెదురు బెదురుగా తల్లి వంక డాక్టర్ వంక మార్చి మార్చి చూస్తూంది. పెదాలదురుతున్నాయి. విలక్షణమైన కాంతితో, ముగ్ధత్వంతో నిండిన కళ్ళల్లో మెల్లమెల్లగా నీళ్ళూరుతున్నాయి. ఆమెలో ఉన్న న్యూనతా భావాన్ని ఖరీదైన బట్టలు, నగలు దాచలేకపోతున్నాయి.

"అలా వెర్రి ముఖమేసుకుని చూస్తావేమిటే? చెప్పు." ఆవిడ కసురులో వున్న క్రౌర్యాన్ని గుర్తించింది కృష్ణవేణి. ఆమెలో వున్న అహంకారం కూతురి మీది మమతను చంపేసింది.

"మీరుండండి, నేను కనుక్కుంటాను. ఇలా రా అమ్మా నువ్వు" ఆ అమ్మాయి భుజంమీద చెయ్యేసి పరీక్షచేసే గదిలోకి తీసుకువెళ్లింది కృష్ణవేణి.

డాక్టరు చూపించిన స్టూల్‌మీద కూర్చుంటూ మెల్లగా కళ్ళెత్తి ప్రశాంతంగా ఉన్న డాక్టర్ ముఖాన్ని, వింత వాసనల్ని వెదజల్లుతున్న రూమ్‌ని కలయచూచిందా అమ్మాయి.

"నీ పేరేమిటమ్మా?"

"సుజాత."

"చదువుకుంటున్నావా అమ్మా?"

"బి.ఎ. పాసయానండి."

"ఎమ్.ఎ. కు వెళ్ళలేదేం?" ఆ అమ్మాయిలోని టెన్షన్‌ని తగ్గించడానికి ఆమెను కబుర్లలో పెట్టింది కృష్ణవేణి.

"బి.ఎ. వరకు చదవడమే కష్టమై పోయిందండి. ఊళ్ళో కాలేజి వుంది కాబట్టి ఇంతవరకైనా చదివించారు. మా ఇళ్ళల్లో ఆడపిల్లలని బయటికిపంపి చదివించ డమే!" కళ్ళు విప్పార్చి, గుండెమీద చెయ్యేసుకుంది సుజాత.

తెల్లగా, సుకుమారంగా ఉన్న ఆమె చేతివంక చూస్తూ చిన్నగా నవ్వింది కృష్ణవేణి. "ఏం? యూనివర్సిటీకి పంపితే ఆడపిల్లలు పాడయిపోతారనా?'

అవునన్నట్లుగా తల ఊపింది సుజాత.

"అవును. మన వెధవ సమాజంలో ఆడదానికో న్యాయం, మగవాడికో న్యాయం. మగపిల్లలు చదువు నెపంతో ఎంత అప్రాచ్యపు పనులు చేస్తున్నా వాళ్లను నెత్తిమీద పెట్టుకుని పూజిస్తారు. ఆడపిల్లలెంత ఒబ్బిడిగా ప్రవర్తించినా, ఎంత సమర్థులయినా వాళ్లని గురించి ఈసడిస్తూ మాట్లాడతారు..... యూనివర్సిటీకి పంపితే ఆడపిల్లలేనా పాడయేది, మగపిల్లలు పాడవరు కాబోలు! .....మగవాడు చేసిన తప్పు పొగలా క్షణంలో రూపుమాసిపోతే, ఆడపిల్ల చేసిన తప్పునిప్పులా కాల్చి వాత పెడుతుంది" ఆవేశం సుడులు తిరిగింది డాక్టర్ హృదయంలో. డాక్టర్ మౌనంతో సుజాత ముఖంలో ఉన్న కాస్త కూస్త కళ కూడ హరించిపోయింది. జలజలా మంచి ముత్యాలు పాలమీగడ మీద దొర్లినట్లు సుజాత చెక్కిళ్ళ మీద కన్నీళ్ళ దొర్లాయి.

'సుజాతా!' మునివేళ్లతో ఆమె గడ్డాన్నెత్తి కలవరంగా చూచింది కృష్ణవేణి.

'నీ బాధేమిటో చెప్పు. నేను చెయ్యగల సహాయం తప్పకుండా చేస్తానమ్మా!'

అందమైన ఆమె ముఖం వేపు జాలిగా చూసింది కృష్ణవేణి. ప్రపంచంలోని కల్మషమేమిటో ఎరగనట్లున్న ఈ శ్రీమంతురాలి బాధేమిటో అంతుపట్టలేదామెకు.

'డాక్టర్! నాకు బ్రతకాలని లేదు. ఐవాన్ట్ టు డై!' వలవల ఏడ్చింది సుజాత.

'తప్పమ్మా! అలాంటి పాడు ఆలోచన రానివ్వకూడదు నువ్వు. చావును కోరేంతగా నిన్ను బాధపెడుతున్న సమస్య ఏమిటి? చూడు. ఏడవకలా.' సుజాత చెక్కిళ్ళ మీద కన్నీటిని తుడిచింది కృష్ణవేణి.

'డాక్టర్! నా కథ విని నన్ను అసహ్యించుకోరు కదూ?' బెదురుగా డాక్టర్ వంక చూసింది సుజాత.

"నో, నో" జాలిగా సుజాత వంక చూసింది కృష్ణవేణి.

"డాక్టర్! మా కుటుంబ ఆచారాల ప్రకారం పెద్ద మనిషయిన ఆడపిల్లల్ని బయటి ముఖం చూడనీయరు. మా నాన్నగారికి నేనంటే ఉన్న గారాబంచేత నాకు కాలేజీకి వెళ్ళే అవకాశం కలిగింది. సరిగ్గా టైమ్‌కు కాలేజీలో నన్ను విడిచే కారు కాలేజీ టైమయ్యే సరికి నాకోసం సిద్ధంగావుండేది. కాలేజీలో మరీ అవసరమయితే తప్ప, అదీ ఆడపిల్లలయితే తప్ప ఎవరితోనూ మాట్లాడొద్దని ఆజ్ఞ జారీ చేశారు మా వాళ్ళు. నాకు మాత్రం నాతోటి ఆడపిల్లల్లా రకరకాలుగా ముస్తాబు చేసుకుని నలుగురి తోటి సరదాగా నవ్వుతూ, తుళ్ళుతూ కబుర్లు చెబుతూ నడిచి కాలేజీకి రావాలనీ, అబ్బాయిలు కామెంట్స్ విసురుతూంటే దొంగ కోపం నటించి వాళ్ళకి పెంకి జవాబు చెప్పాలనీ, గడుసు ప్రశ్నలతో లెక్చరర్స్‌ని ఏడిపించాలనీ... ఎన్నో కోరికలుండేవి. కాని, మా ఇంటి ఆచారాలు నా కాళ్ళకు సంకెళ్ళయేవి. నా నోటికి తాళం వేసేవి. స్వేచ్ఛకోసం అలమటిస్తున్న నా మనసుకు మా కాలేజి స్పోర్ట్స్ ఛాంపియన్ శ్యాంబాబు దగ్గరయ్యాడు. అతనితో నా స్నేహం మా వాళ్లకు తెలిసేటప్పటికి మా మధ్య చనువు బాగా పెరిగింది. నా మీద కట్టడి ఎక్కువయే కొలది నాలో ఓవిధమైన తెగింపు, నా మంచితనం మీద, మనోనిబ్బరంమీద నమ్మకంలేని వాళ్లమీద ఓ విధమైన కసి బయలుదేరాయి. ఫలితం... ఓ అల్పక్షణంలో కాలుజారాను. వయసులో వున్న ఆడపిల్లల్ని బయటికి పంపితే చెడిపోతారన్న మావాళ్ళ నమ్మకాన్ని నిజం చేసాను." ఒక్కసారి భోరుమంది సుజాత.

"ఏడవకు సుజాతా! ఆడపిల్లలు బయటకు రావడం వల్ల ఎప్పుడూ చెడిపోరు. మనిషి చెడిపోవడానికి కారణం వాళ్ళ మనఃప్రవృత్తులు, వాళ్ళచుట్టూ ఉన్న పరిస్థితులు. ఏదో ఒక వ్యాపకంతో బయట తిరిగే వాళ్లకే కాదు, సోమరితనంగా

గోళ్లు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చునే వాళ్ళకు కూడా చెడి పోవడానికి అవకాశం వుంటుంది.'' చదువుకున్న ఆడపిల్లల్ని, ఉద్యోగం చేస్తున్న ఆడపిల్లల్ని తక్కువగా చూసే వాళ్ళంటే విసుగు కృష్ణవేణికి.

"అలా అంటే మన పెద్దవాళ్ళొప్పుకోరు డాక్టర్!'' ఓ క్షణం ఆగింది సుజాత.

"ఇప్పుడు మా అమ్మ నన్నిక్కడికెందుకు తీసుకొచ్చిందో తెలుసా డాక్టర్? నా ప్రేమ ఫలాన్ని, మా అమ్మ దృష్టిలో నా పాప ఫలాన్ని తీసేయించడానికి.'' సర్వం కోల్పోయినట్లుగా ఉందామె ముఖం.

"అదేమిటమ్మా! శ్యాంబాబుని పెళ్ళి చేసుకోవచ్చు గదా నువ్వు? మీ వాళ్లొప్పు కోవడం లేదా?'' ఆత్రుతగా అడిగింది కృష్ణవేణి.

"ఒప్పుకోకపోవడం కాదు డాక్టర్... అతన్ని నా పిలుపు అందనంత దూరానికి మా వాళ్ళ డబ్బు తరిమివేసింది.''

శూన్యంలోకి వెర్రిగా చూస్తోంది సుజాత. ఆ అమ్మాయి చూపులో వున్న విషాదానికి కదిలిపోయింది కృష్ణవేణి.

"డాక్టర్! నా ప్రేమఫలాన్ని ధైర్యంగా లోకంలోకి తీసుకువచ్చి పెంచగలిగే శక్తిలేదు. కాని, ఎంతో అపురూపంగా చూచుకోవలసిన నా బిడ్డను తీసేయించు కోవడమనే ఊహే నన్ను పిచ్చిదాన్ని చేస్తోంది డాక్టర్! చావడానికేదో ఒక మందివ్వండి. దయచేసి నాకీ సహాయం చేయండి. నేను చావడానిక్కూడా వీల్లేకుండా కట్టడి చేశారు మా వాళ్ళు.'' కుమిలి కుమిలి ఏడుస్తోంది సుజాత.

"తప్పమ్మా! అలా మాట్లాడకూడదు. నూరేళ్ళ బ్రతుకు నీ ముందుంది. తెలిసో తెలియకో చేసిన ఒక తప్పుకి నీ నిండు జీవితం బలి అవకూడదు. శీలం విలువైనదే కాని, జీవితం ఇంకా విలువైనదమ్మా! శీలం జీవితంలో ఒక భాగం మాత్రమే, జీవితంలో ఎంతో సాధించడానికి అవకాశమున్న నువ్వు నీ బ్రతుకు నంతం చేసుకోకూడదు. నువ్వు చేసింది తప్పని నమ్మితే, అది మళ్ళీ జరగకుండా చూచు కోవడమే నీకర్తవ్యం. మనుషుల వల్ల తప్పులు జరగడం సహజమని నమ్మితే నీలాంటి ఆడపిల్లలు ఆత్మహత్యే సమస్యకు పరిష్కారమనుకునే పరిస్థితి ఉండదు''. సుజాత భుజాలమీద అనునయంగా చేతులు వేసింది కృష్ణవేణి.

"కాని, గతాన్ని మరచిపోవడమెలా? ఎంతో పవిత్రురాలిలా నలుగురిలో తిరగడమెలా?'' వెక్కిళ్ల మధ్య తనను తాను ప్రశ్నించుకున్నట్లుగా అంది సుజాత.

"లోకంలో నీలాంటి వాళ్ళు చాలామంది ఉన్నారు. వినగా వినగా నువ్వు

తప్పటడుగు వెయ్యడానికి కారణం నీ చదువేననే భావం నీలోకూడా పాతుకుపోయినట్లుంది. కమాన్ సుజాతా! బి బ్రేవ్! పిచ్చి ఆలోచన లేమీ చెయ్యొద్దు. నీ బ్రతుకును అందంగా మలచుకోవడానికి ప్రయత్నించు." సుజాతను ఓదార్చడానికి ప్రయత్నించింది కృష్ణవేణి.

***

డిస్చార్జి అయిన పేషెంట్స్‌కి మందులు రాసిచ్చి అలసటగా కుర్చీలో వాలింది డాక్టర్ కృష్ణవేణి. ఒక్కసారి ఒంటరితనం భయంకరంగా ముందు నిలిచినట్లయింది. పొంగుతున్న చైతన్యంలా గడిచిపోయిన విద్యార్థి జీవితం గుర్తుకు వచ్చింది. హౌస్‌సర్జన్సీ చేస్తున్నప్పటి చిలిపి ఊహలు, ఒక్కసారి థ్రిల్‌తో గుండె ఝల్లుమనిపించే సంఘటనలు, రాముతో పరిచయం, తనూ, అతనూ నైట్ డ్యూటీలో కేస్‌షీట్స్ వ్రాస్తూ, ఎమర్జెన్సీస్‌కి అటెండ్ అవుతూ కలబోసుకున్న అందమైన ఊహలు, తాము వివాహం చేసుకోవాలని నిశ్చయించుకోవడం, తన ఆశయాల కనుగుణంగా ఈ టౌన్‌లో నర్సింగ్‌హోం పెట్టడం, రాము ఎమ్.ఎస్. చదవడానికి వైజాగ్ వెళ్ళిపోవడం... అన్నీ ఒక్కసారి కళ్ళముందు కదిలాయి. రాము స్మృతితో కృష్ణవేణి హృదయమూ, శరీరమూ కూడా స్పందించాయి. అప్రయత్నంగా డాక్టర్ రామారావు వ్రాసిన లెటర్ని చేతిలోకి తీసుకుంది కృష్ణవేణి.

"డియర్ వేణూ!

నేను రేపు అక్కడకు వస్తున్నాను. నీతో ఒక ముఖ్యమైన విషయం మాటాడాలి. పరీక్షలు దగ్గరవుతూ ఉండటం వల్ల తీరిక లేక నీకు తరచు లెటర్సు వ్రాయడంలేదీ మధ్య. మిగతా విషయాలు రేపు మాట్లాడుకుందాం.

-రాము."

ఎంతో పొడిపొడిగా వున్న ఆ లెటర్ని చూసి అసంతృప్తితో మూలిగింది కృష్ణవేణి హృదయం. వయసులో వున్న అబ్బాయి తన కాబోయే భార్య కిలాగేనా లెటరు వ్రాయడం? రాము వచ్చాక చెవులు మెలేసి మరీ చెప్పాలి, ఎంత మధురంగా లెటరు వ్రాయాలో... తనని ఏడిపించాలని ఇలా వ్రాసి వుంటాడీ సిల్లీ రాము. అయినా, పరీక్షలు నెలరోజుల్లో వుంచుకుని ఇప్పుడేం మునిగిపోయిందని వస్తున్నాడో? ఏమిటబ్బా తనతో మాట్లాడవలసిన ముఖ్యమైన విషయం! బహుశా, వెంటనే పెళ్ళి చేసుకుందామనడు కదా? ఎమోషనల్ ఛాప్. పెళ్ళి చేసేసుకుని తనుకూడా ప్రాక్టీసులో సెటిలయిపోతానని ఎంత రాద్ధాంతం చేశాడు! రోజు

రోజుకూ కాంపిటీషన్ పెరిగిపోతూంది ప్రొఫషన్‌లో. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, పెళ్ళయాక వేరుగా ఉండడం కష్టమవుతుందని నచ్చ చెప్పేటప్పటికి ఎంత కష్టమయింది! ఇంకెంత? రెండు నెలలు కళ్ళు మూసుకుంటే రాముా శాశ్వతంగా తనముందుంటాడు. నర్సింగ్ హోమ్ బాధ్యతనంతటినీ అతనికి అప్పగించి, సాధ్యమైనంత ఎక్కువకాలం ఇంట్లో ఉండి అతని పనులు... తరువాత పుట్టే బుల్లి బుల్లిపాపాయిల పనులు చూచుకుంటుంది.

రాము కనిపించేవరకు మధురమైన ఊహల్లో పరవశిస్తూనే ఉంది డాక్టర్ కృష్ణవేణి. అతనికి టిఫిన్, కాఫీ ఇచ్చి విశ్రాంతి తీసుకోమని చెప్పి, హాస్పిటల్ పని పూర్తి చెయ్యడానికి వెళ్లింది. పేషెంట్స్‌నందరినీ త్వరత్వరగా చూచి పంపించేసి రాము మంచానికెదురుగా కుర్చీ లాక్కుని కూర్చుంది.

"రాముా!"

"ఊ." ఎక్కడో ఉన్నట్లుగా పలికి మెల్లగా కళ్ళువిప్పాడు. అతని కళ్ళు కృష్ణవేణి ముఖాన్ని పరిశీలనగా చూస్తున్నాయి. అతని కళ్ళముందు అరచేతినటూ ఇటూ ఆడించి చిలిపిగా నవ్వింది కృష్ణవేణి.

"ఎక్కడున్నావు బాబూ!" కుర్చీలోముందుకు వంగి కూర్చుని కుతూహలంగా రాముా వంక చూచింది కృష్ణవేణి. అతని కళ్ళల్లోని కలవరాన్ని చూచి ఆందోళన పడింది.

"ఏం రాముా? ఎందుకంత దిగులుగా వున్నావు. ప్రొఫెసర్‌తో ఏమైనా గొడవ వచ్చిందా?" ఆతృతగా అడిగింది కృష్ణవేణి.

"లేదు వేణూ! నేను నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి." లేచి నిటారుగా కూర్చున్నాడు రాము. అతని దిగుల్ని పారద్రోలాలని గలగల నవ్వుతున్న దల్లా బిగుసుకుంటున్న అతని ముఖకవళికల్ని చూచి ఆశ్చర్యంతో ఆగిపోయింది.

"అదేం రాముా! ఎందుకలా అవుతున్నావు?" అతనిలో జరుగుతున్న సంఘర్షణ తాలూకు అలసట కనిపిస్తూందతని కళ్ళలో.

"వచ్చే అయిదవ తేదీన నా మారేజ్ వేణూ!" పర్వతాగ్రం నుండి జలపాతం విరిగిపడినట్లుగా నవ్వింది కృష్ణవేణి.

"హా నాటీ! నీ మారేజ్ ఏమిటోయ్? మన మారేజ్ అను. అయినా, నాతో చెప్పకుండానే డేట్ కూడా నిశ్చయంచేశావు, ఎంతధైర్యం నీకు!" కళ్ళు విప్పార్చి

అదిలిస్తున్నట్లుగా చూసింది కృష్ణవేణి.

"నువ్వు సీరియస్‌గా తీసుకోవడం లేదు వేణూ!"

"ఏం సీరియస్సోయ్, మహానుభావా! తెల్లారకుండానే నాకు పరీక్షలు బాబోయ్, నే పోతానని బండెక్కేస్తావు. నువ్వున్న ఈ కాసేపూ హాయిగా నవ్వకుండా, నన్నేడిపించాలని నువ్వుచేసే ఏక్షన్సనన్నిటినీ సీరియస్‌గా తీసుకుని గుండె పగిలి చావమంటావా? నా వల్ల కాదు బాబూ!" సుతారంగా కళ్ళుతిప్పి బుంగమూతి పెట్టింది కృష్ణవేణి.

"ఓ వేణూ! నువ్వెందుకు నన్నర్థం చేసుకోవు?" బాధగా తల పట్టుకుని కూర్చున్నాడు రామూ.

"డోంట్ బి సిల్లీ, రామూ! మరో రెండునెలల్లో నువ్వొచ్చి నర్సింగ్‌హోమ్ బాధ్యతనంతా తీసుకుంటావనీ... నేను నిశ్చింతగా నీ ఇల్లాలుగా, నీ పిల్లల తల్లిగా నీ సుఖదుఃఖాల భాగస్వామిని కావాలని కోరుకుంటున్నాను. నా ఈ అందమైన కల క్షణ మాత్రమే అవనీ, చెరిగిపోవడం భరించలేన్నేను. పరిహాసానికి కూడా నువ్వలా మాట్లాడవద్దు. ప్లీజ్!" ప్రేమతో జ్వలిస్తున్న ఆమె కళ్ళ వంక చూడలేక ముఖం పక్కకు తిప్పుకున్నాడు రాము. ఒక క్షణం మౌనంగా వున్నాడు.

"నాకూ కలలున్నాయి వేణూ! నా భార్యను పువ్వులా అతి సుకుమారంగా చూచుకోవాలనీ, నా భార్య నేను ఇంటికి వచ్చేటప్పటికి హాయిగా నవ్వుతూ నా కెదురవాలనీ, నా బిడ్డలు పనివాళ్ళ చేతుల్లో కాక తమ తల్లి ప్రేమతో, పెంపకంతో సుశిక్షతులవాలనీ నా కెంతో వుంది. నా భార్య రోజల్లా కష్టపడి సంపాదిస్తూ, అహంకారంతోనో, అలసటతోనో అస్తమానూ చిటపటలాడటం సహించలేన్నేను." ఎవరో కొత్త వ్యక్తిని చూస్తున్నట్లతని వైపు చూస్తూకూర్చుంది కృష్ణవేణి.

"మరి...? మరి...?" మాటలు రానట్లుగా తడబడింది కృష్ణవేణి.

"మరి ఇన్నాళ్ళు నిన్ను పెళ్లాడతానని ఎలా అన్నాననా నీ సందేహం? ఈ మూడేళ్లనుండి నీ సంపాదన మీద ఎలా బ్రతికానా అని అనుమానపడుతున్నావు కదూ? సారీ, వేణూ! అసలు నాకు మొదటి నుండీ డాక్టర్ని పెళ్ళాడడం ఇష్టం లేదు. నేను అడిగినదానికి మించి డబ్బు పంపి ఈ మూడేళ్లు డబ్బు సమస్య లేకుండా నేను నిశ్చింతగా చదువుకునేందుకు సహాయపడ్డావు. అందుకు నేనెంతో కృతజ్ఞుడిని." అప్పటికి కృష్ణవేణి అతను తనను ఫూల్ చెయ్యడానికి మాట్లాడడం

లేదని, ఎంతో సీరియస్‌గా మాట్లాడుతున్నాడని బలవంతాన నమ్మింది.

"రామూ! నేనంటే నీకు కృతజ్ఞతేనా, అంతకు మించిన అనుబంధం ఇంకేమీ లేదా! ఇటుచూడు. నా వైపు చూచి చెప్పు రామూ?" రెక్కలు తెగి పడిన పక్షి ఆర్తనాదంలా ఉందామె స్వరం.

"వెరీ సారీ వేణు! అనవసరంగా నిన్ను చేసుకుంటానని నమ్మించినందుకు సిగ్గుపడుతున్నాను." తల వంచుకుని చేతి గోళ్ళవంక చూచుకున్నాడతను.

"సిగ్గుపడవలసింది నువ్వుకాదు రామూ, నేను సిగ్గు పడాలి. మీ మగాళ్లింత నయవంచకులని తెలిసీ నీకు మనసిచ్చి దగ్గరైనందుకు నేను సిగ్గుతో చితికిపోతున్నాను. నీ కాబోయే భార్యగా పేరుపడి, నీ నోటితో మన అనుబంధాన్ని విని నా తల వంగి పోతూంది." రోషంగా అతనివంక చూస్తూ లేచి నిలుచుంది కృష్ణవేణి.

"ఆవేశపడకు వేణూ! కొంచెం ప్రాక్టికల్‌గా ఆలోచించు. నా కోరికలకనుగుణంగా నన్ను పోనీయ్. నీ సంపాదన చూచి ఆకర్షితులై నిన్ను చేసుకోవడానికి ముందుకొచ్చే వాళ్ళు చాలామంది వుంటారు. ఎలాగూ డాక్టర్స్‌కి జాబ్స్ లేవుగా? భార్య డాక్టరయితే ప్రాక్టీసు బాగుంటుందనే ఆలోచనతోనన్నా ఎవరో ఒక డాక్టరు నిన్ను పెళ్లాడతాడు."

అతనివంక విస్తుపోయి చూచింది కృష్ణవేణి. "బహుశా ఈ ఆలోచనతోనే నువ్వు నాకు దగ్గరయిఉంటావు కదూ? నీ దురాలోచన, నీ మోసం ఇప్పుడర్థమౌతున్నాయి నాకు. ఇప్పుడు, నేను భార్యనయితే నువ్వు నా నీడగామాత్రమే మిగులుతావనీ, డాక్టరు రామారావు మరుగున పడిపోయి డాక్టరు కృష్ణవేణి భర్తగా నలుగురి నోళ్లలో నానుతాననీ భయంపట్టుకుంది నీకు కదూ?" సూటిగా అతనివంక చూస్తూ అడిగింది కృష్ణవేణి.

"గుడ్ హెవెన్స్, ఎంతలా మాటలు విసురుతున్నావు వేణూ! అందుకే నా ఫ్రెండ్స్ డాక్టర్ని పెళ్ళాడొద్దురా బాబూ అని వాదిస్తారు."

"నువ్వూ, నీ ఫ్రెండ్స్ ఈ రోజుల్లో పుట్టవలసిన వాళ్ళు కాదు. మీకు జన్మసిద్ధమైన సంస్కారమూ లేదు, చదువు నేర్పిన విజ్ఞానమూ లేదు. చదువుతో పువ్వుల్లా వికసించవలసిన మీ హృదయాలు అజ్ఞానంతో కుళ్లిపోతున్నాయి. మీరెంత నీచానికన్నా తలపడగలరు." ఆవేశంగా అంది కృష్ణవేణి.

రాము ముఖం కోపంతో ఎర్రబడింది.

"అవును. మా మనసులే కుళ్ళి పోతున్నాయి. మీరు పువ్వుల్లా వికసించి తుమ్మెదల్ని చుట్టూ తిప్పుకుంటున్నారు." కసిగా కృష్ణవేణి వంక చూచాడు డాక్టర్ రామారావు.

"రామూ! ఏమిటి నువ్వనేది? చివరికి... చివరికి... నా నడతని కూడా నువ్వు అనుమానిస్తున్నావా? చెప్పు రామూ!" ఆవేశంగా అతని చెయ్యిపట్టుకుని ఊపింది.

మౌనంగా తనవంక చూస్తున్న అతని కర్కశత్వాన్ని చూస్తుంటే ఇలాంటివాడినా నేను ప్రేమించింది! అని క్రుంగిపోయింది కృష్ణవేణి.

"తెలిసి తెలిసి నీలాంటివాళ్ళకు చేరువయ్యే నాలాంటి ఆడపిల్లలకీ శిక్ష పడవలసిందే రామూ!.... ఇంత హైన్యానికి దిగజారిపోయిన నీతో ఇంక మాట్లాడా లని లేదు. ఇంతటితో మన మధ్యేదైనా బంధమనేది ఉంటే అది తెగిపోయింది. జీవితంలో మరచిపోలేని పాఠాన్ని నేర్పావు. దయచేసి సాధ్యమైనంత త్వరగా ఇక్కడి నుండి వెళ్ళిపో. అంతఃపురంలో పువ్వులా సుకుమారంగా పెరిగిన పతివ్రతనెవరినైనా పెళ్ళిచేసుకుని నువ్వన్నా సుఖపడు. నీ పెళ్ళికి నన్ను పిలవడం మరచిపోకు. నీ పతివ్రతను చూసి ఆనందిస్తాను." కన్నీళ్ళు ఇంకిపోయి శూన్యంగా ఉన్న కళ్ళతో, కోపంతో ఎరుపెక్కిన ముఖంతో భయం గొలిపేలా ఉంది కృష్ణవేణి రూపం. ఆమెకు జవాబు చెప్పకుండా డ్రెస్ వేసుకుని, లుంగీ మడతపెడు తున్నాడు డాక్టర్ రామారావు. పళ్లబిగువున కన్నీళ్ళనాపుకుంటోంది కృష్ణవేణి.

"వెల్, డాక్టర్ రామారావ్! నువ్వు ప్లస్ నీ ఎమ్.ఎస్. - వెరసి నీ ఖరీదెంత?" హేళనగా నవ్వుతూ అడిగింది కృష్ణవేణి.

"నాలుగు లక్షలు" పళ్లు గిట్టకరుచుకుంటూ అన్నాడు డాక్టర్ రామారావు.

"క్వైట్ ఎ లక్కీ బిజినెస్. నీకొస్తున్న దాని ముందు నేను సంపాదించేదెంత? నీకింత ఖరీదుందని నాకు తెలియదే?" నిరసనగా చూచింది కృష్ణవేణి.

"రియల్లీ అయామ్ లక్కీ! అంత అందమైన మంచి అమ్మాయి నాలుగు లక్షలతో నా భార్య అవడం నా అదృష్టం" అతిశయంగా తల ఎగరేశాడతను.

"అందమైన మంచి అమ్మాయేనా? లేక మగ పురుగు ముఖం కూడా చూడని మహాపతివ్రత కూడానా?" కోపంగా అడిగింది కృష్ణవేణి.

"అఫ్‌కోర్స్, అనాఘ్రాతపుష్పం."

అతడి అహంకారాన్ని చూచి ఉడికిపోతూంది కృష్ణవేణి.

"స్నేహంగా నీ నుండి విడిపోదామని వచ్చాను. నువ్వింత సీరియస్‌గా తీసుకుంటావనుకోలేదు. డబ్బు అందగానే నీకు పంపిస్తాను." సూట్‌కేస్ చేత్తో పట్టుకున్నాడతను.

"గోటు హెల్ విత్ యువర్ బ్లడీ మనీ! నువ్వొక్క చిల్లిగవ్వ కూడా పంపద్దు."

"అయామ్ సారీ, వేణూ!"

"నేను డాక్టర్ కృష్ణవేణిని. వేణూను కాదు, డాక్టర్ రామారావ్! బిహేవ్ యువర్ సెల్ఫ్!" అతను వెళ్ళిపోతూంటే ఒక్కొక్క అడుగు తన హృదయం మీద వేస్తూ వెళ్ళినట్లు బాధపడింది. అతను చూపుకందినంత మేర నిర్జీవంగా చూస్తూ నిలబడి అతను కనుమరుగవగానే ఒక్కసారి బావురుమంది కృష్ణవేణి.

***

"ఓ! సుజాతా! ఏమిటమ్మా ఇలావచ్చావు?" చదువుతున్న మెడికల్ జర్నల్ పక్కన పడేసి సుజాతనాహ్వానించింది డాక్టరు కృష్ణవేణి. డాక్టరు రామారావిచ్చిన షాక్ నుండి తేరుకోలేదింకా కృష్ణవేణి. ముఖమంతా చాలా నీరసంగా,పాలిపోయి ఉంది. తల వంచుకుని వానిటీబాగ్ మీద చూపుడు వేలితో రాస్తూంది సుజాత.

"ఆరోగ్యం బాగుందా సుజాతా? కాంప్లికేషన్సేం లేవుగా ఆపరేషనయాక?" ఆదరంగా సుజాత వంక చూచింది కృష్ణవేణి.

"నా బ్రతుకే కాంప్లికేషన్స్ మయమయిపోయింది డాక్టరుగారూ!" కన్నీళ్ళు చిందాయి సుజాత చెక్కిళ్ళమీద.

"అదుగో, అలా మాట్లాడవద్దనే నేను చెప్పేది. ఈసారలా మాట్లాడావంటే నేన్నీతో మాట్లాడనే మాట్లాడను." అంటూ సుజాత భుజంమీద చెయ్యేసింది కృష్ణవేణి.

డాక్టరుగారి వాత్సల్యాన్ని చూచి కరిగిపోయింది సుజాత.

"నా బ్రతుకునో కొత్త మలుపుకి తిప్పుతున్నారు మీరు. జీవితం మీద నాకు కోరికను కలిగిస్తున్నారు. మీరు నాకందిస్తున్న ఈఆప్యాయతకు బదులివ్వలేను." ఆర్ద్రతతో కదిలిపోతూ కృష్ణవేణి వంక చూసింది సుజాత.

"నాకో బుజ్జి బాబును కనివ్వు. వాడిని పెంచుకుంటూ నువ్వు బదులు తీర్చేశావనుకుంటాను." నవ్వింది కృష్ణవేణి. వాడిపోయిన సుజాత ముఖంలో అసహజమయిన నవ్వు మెరిసింది.

"బుజ్జిబాబుల్ని కనడానికి రేపు నాకు లైసెన్సిస్తారు మేడమ్! అలా చూస్తారేం.?! రేపు రాత్రికి నా పెళ్ళి. ఇంత త్వరలో నాకు వరుడెక్కడ దొరికాడా అని ఆశ్చర్యపోతు న్నారా? ఈ రోజుల్లో డబ్బుకు సాధ్యం కానిదేమీ లేదు. నిమిషాలమీద నాకు వరుణ్ణి కొని తెచ్చారు మా నాన్నగారు." కృత్రిమమైన గాంభీర్యం సడలిపోయి అంతలోనే సుజాత కంఠం రుద్ధమయింది.

"కాని... నా గతాన్నంతా అతన్నించి దాచి ఎలా బ్రతకగలను? నన్నెంతో పవిత్రంగా ఊహించుకొని నన్ను స్వీకరించే అతన్నెలా మోసపుచ్చేది? చెప్పండి డాక్టర్!" ఒకవైపు కర్చీఫ్‌తో కన్నీళ్ళు తుడుచుకుంటూనే కన్నీళ్ళు కార్చింది సుజాత.

"అలాబాధ పడుతూవుంటే నువ్వు బ్రతకలేవు.ఇప్పుడు నువ్వు ఆలోచించవలసినది గతాన్ని గురించి కాదు, భవిష్యత్తు గురించి." కృష్ణవేణి ఓదార్పుతో తేరుకున్న సుజాత వెళ్ళడానికి లేచింది.

"నా పెళ్ళికి వచ్చినన్నాశీర్వదించండి డాక్టర్! రేపు రాత్రికి కారు పంపిస్తాను. తప్పకరండి." వానిటీబాగ్‌లో నుండి శుభలేఖ తీసి డాక్టరు చేతిలో పెట్టి సెలవు తీసుకుంది సుజాత. అనాసక్తంగా శుభలేఖను ప్రక్కన పడేసి హృదయాన్ని కుమిలి స్తున్న ఆలోచనల్లోకి జారిపోయింది కృష్ణవేణి.

మరునాటి రాత్రి సూత్రధారణ సమయానికి సుజాత పంపిన కారులోనుండి దిగింది కృష్ణవేణి. ఆహుతుల మధ్యనుండి తల వంచుకుని కళ్యాణ మండపం వైపు నడుస్తున్న డాక్టర్ కృష్ణవేణి వధూవరుల వేపు చూచి మ్రాన్పడి పోయింది.

సుజాత పక్కన మధుపర్కాలలో మెరిసిపోతున్నాడు డాక్టర్ రామారావు.

- 'ఆంధ్రప్రభ' వీక్లీ, *1973.*